విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

పరీక్షల నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఇంటర్మీడియట్, ఎస్ఎస్సి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టరు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లా డుతూ ఇంటర్మీడియట్, ఎస్.ఎస్.సి. పరీక్షల నిర్వహణలో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడి యట్ పరీక్షలు ఈనెల 15 వ తేదీ నుండి ఏప్రిల్, 4 వ తేదీ వరకు నిర్వ హించనున్నట్టు తెలిపారు. ఎస్.ఎస్.సి పరీక్షలు ఏప్రిల్, 3 వ తేదీ నుండి 18 వ తేదీ వరకు ఉంటాయన్నారు. ఇంటర్మీడియట్ పరీక్ష ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎస్.ఎస్.సి. పరీక్షలు ఉదయం 9. 30 ని.ల నుండి 11. 45 ని.ల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను 9 గంటల తరవాత, ఎస్.ఎస్.సి .పరీక్షలకు ఉదయం 9.30 నిల తరవాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించబో రన్నారు.వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాలలో త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు 52 పరీక్షా కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.మొదటి సంవత్సరం 18352 మంది, రెండవ సంవత్సరం 17435 మంది మొత్తం 35787 మంది పరీక్షకు హాజరు అవుతున్నారన్నారు. ఏప్రియల్ 3 వ తేదీ నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు 24,586 మంది విద్యార్థులు హాజరవు తున్నారని అందులో 12,929 మంది పురుషులు, 11,657 మంది స్త్రీలు ఉన్నారని కలెక్టరు తెలిపారు. పరీక్షలు నిర్వహణకు 121 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, 22 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. కృష్ణవేణి అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఏవీ సుబ్బ రాజు, జిల్లా విద్యా శాఖాధికారి ఆర్. వెంకట రమణ, డిఐఈఓ కె.వి సత్యనారా యణ, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ,తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ప్రత్యేక సర్వీసులు

విశాలాంధ్ర-భీమవరం టౌన్: ఈ నెల15 నుండి ఏప్రిల్ 4 వరకు జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థుల ప్రయాణానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. వీరయ్య చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటలకే ప్రారంభం కానున్నందున ప్రస్తుతం ఉన్న షెడ్యూల్స్ ను మార్పు చేసి ఉదయం గం. 7:45 నుండి 8:00 గంటల లోపు మండల కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సుల షెడ్యూల్సును మార్పు చేశామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల పట్ల మహిళా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ టి. రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక రూరల్ స్టేషన్‌లో మండల పరిధిలోని సచివాల యాల మహిళా పోలీసుల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు స్టేషన్ సమాచారం అందించాలన్నారు.విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకుండా అంకిత భావంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో మండల పరిధిలోని సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నులి పురుగు నిర్మూలన విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - వీరవాసరం : నులి పురుగుల నిర్మూలన మందును 1 నుండి 19 ఏళ్లు ఉన్న ప్రతి ఒక్కరికీ అందించాలని, జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమం విజయవంతం చెయ్యాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం వీరవాసరం మండలం వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యం పి యు పి పాఠశాల, అంగన వాడి సెంటరును జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నులి పురుగుల నిర్మూలనా టాబ్లెట్స్ పిల్లలకు ఎంత మందికి ఇచ్చారు.... ఇచ్చిన వారు ఏ విధంగా వేసుకున్నారు,ఇంకా ఎంత మందికి ఇవ్వాలని అధికారులను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా కారణాల వలన ఈ రోజు ఆల్బెండజోల్ మాత్రలు వేయని పిల్లలకు మార్చి 18 తేదీన మాప్ అప్ డే రోజున వేయడం జరుగుతుందని, తలిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధతీసుకుని తప్పనిసరిగా తమ పిల్లలకు మందు వేయించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి కోరారు.జిల్లా కలెక్టరు వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఐ సి డి యస్ అధికారి బి.సుజాతా రాణి, తహశీల్దారు యం. సుందర రాజు, యంపిడివో ఉమా మహేశ్వర రావు, వైద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిడిపివో, ఏయస్‌యంలు, ఆశావర్కర్లు, అంగనవాడీ సిబ్బంది,తది తరులు పాల్గొన్నారు.

బొబ్బిలి కొండలరావు మృతి

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, ప్రస్తుత అధ్యక్షులు బొబ్బిలి కొండలరావు (88) పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కొండలరావు చిన్నతనం నుండి క్రీడల పట్ల మక్కువ కలిగి టెన్నిస్ , బాస్కెట్‌బాల్ చెడుగుడు పోటీల్లో పాల్గొని రాణించారు. వీరు ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఎంఆర్ అప్పారావు, ముఖ్య అనుచరులుగాను మాజీ శాసనసభ్యులు హనుమంతరావు సహ విద్యార్థి గాను, ప్రస్తుత శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు అనుచరులుగా ఉన్నారు. నూజివీడు ప్రాంతంలో బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. కొండలరావుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కొండలరావు మృతి పట్ల పలువురు ప్రముఖులు శ్రద్ధాంజలి ఘటించారు.

మొబైల్ షాపులో చోరీ

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కోవెల సమీపంలో మంగళవారం చోరీ జరిగింది. షాపు యజమాని సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వెంకటేశ్వర స్వామి కోవెల సమీపంలోనీ సాయి మొబైల్ షాపులో గుర్తు తెలియని అగంతకుడు రూ.50 వేల విలువ చేసే కొత్త సెల్ ఫోన్ లు, రిపేర్ కు వచ్చిన సెల్ ఫోన్లు ఇతర వస్తువులు చోరీకి పాల్పడినట్లు సునీల్ కుమార్ తెలిపారు. చోరీ సంఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

బంగారం, నగదు చోరీ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక సాలిపేట లో కంచర్ల జితేంద్ర అనే కిరాణా వ్యాపారి ఇంట్లో సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు,వెండి వస్తువులు,కొంత నగదు చోరీకి గురయ్యాయి.జితేంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలో జరిగే బంధువుల వివాహ కార్యక్రమానికి శనివారం వెళ్లి ఆ తరువాత రోజు ఆదివారం ఇంటికి వచ్చి చూడగా మూడు బీరువాలు పగులగొట్టి వాటిలో ఉన్న 8 కాసుల బంగారు వస్తువులు,10కేజీల వెండి, వస్తువులు రూ.75వేల నగదు దొంగలు దోచుకుపోయినట్లు గుర్తించారు.వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఎస్సై సాగర్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్క్స్ సిద్ధాంతాలకు మరణం లేదు

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - భీమవరం : ప్రపంచ కార్మికులారా ఏకం కండి పోరాడితే పోయేదేమీలేదు బానిస సంకెళ్లు తప్ప అంటూ ప్రపంచ కార్మిక వర్గాన్ని జాగృతం చేసి శ్రమదోపిడీ అంతానికి దోపిడీ రహిత సోషలిస్టు సమాజ నిర్మాణానికి బాటలు వేసిన మహా మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ సిద్ధాంతాలకు మరణం లేదని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు, తత్వవేత్త కారల్ మార్క్స్ 140 వ వర్థంతి సందర్భంగా మంగళవారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ నాయకులు కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ మార్క్స్ మృతి చెంది 140 సంవత్సరాలు గడచినా ఆయన సిద్ధాంతాలు సజీవంగా నిలిచే వున్నాయన్నారు. దోపిడీ వ్యవస్థ వున్నంతకాలం మార్క్సిజం అజే యంగా అజరామరంగా నిలిచే వుంటుందన్నారు. మార్క్స్ రచనలు గొప్ప మానవతావాదంతో కూడుకున్నవన్నారు. సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ అంతానికి కార్మిక సంక్షేమానికి మార్క్స్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు సంఘటిత పోరాటాలకు మార్క్స్ రచనలు ప్రేరణగా నిలిచాయన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, పార్టీ నాయకులు నాగిడి శాంతమూర్తి, ప్రజానాట్యమండలి నాయకులు భాషా తదితరులు మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

నివాస స్థలాల సమస్య పరిష్కారానికిచర్యలు

లబ్ధిదారుల సమస్యను వెలుగులోకి తెచ్చిన విశాలాంధ్ర

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో నివాస స్థలాలను లబ్ధిదారులకు అప్పగించే పనులను వేగవంతం చేశారు. మండలంలో పట్టాలు ఇచ్చినా స్థలాలు లేకపోవటంతో 400 మందికి పైగా లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇళ్ళు మంజూరు చేశారు. స్థలాలు లేకపోవటంతో ఇళ్ళు నిర్మించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులను విశాలాంధ్ర ఈనెల 11వ తేదీన వెలుగులోకి తెచ్చింది. లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులను ఆదేశించటం, ప్రతీరోజు దీనిపై సమీక్ష చేయటంతో స్థలాల సేకరణపై దృష్టి పెట్టారు. దాదాపుగా ఈ సమస్య పరిష్కారం కొలిక్కి వచ్చింది. మండలంలో ఎనిమిది పంచాయతీలలో సమస్య ఎదురైంది. వీటిలో ధర్మాజీగూడెం, పుప్పాలవారిగూడెం, కొత్తపల్లి, వేములపల్లి, యడవల్లి, రంగాపురంలో స్థలాలను సేకరించారు. మఠంగూడెం పంచాయితీ చంద్రన్నపాలెంలో స్మశాన వాటిక ప్రక్కన స్థలాలు ఇచ్చారు. ఇక్కడకు వెళ్ళేందుకు లబ్ధిదారులు సుముఖత చూపలేదు. అయితే స్మశానానికి చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని అధికారులు హామీ ఇవ్వటంతో లబ్ధిదారులు సుముఖత చూపటంతో ఇక్కడ సమస్య పరిష్కారమైంది. కె.గోకవరం చెరువు ముంపు ఇచ్చిన స్థలాన్ని లబ్ధిదారులు సూచన మేరకు తగినంత మెరక చేస్తామని హామీ ఇవ్వటంతో ఇక్కడ సమస్య పరిష్కారమైంది. మిగిలిన ఆరు గ్రామాలలో స్థలాలను సేకరించారు. వీటి అనుమతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపే పనిలో మండల స్థాయి అధికారులు నిమగ్నమయ్యారు. వీటికి అనుమతులు రాగానే స్థలాలు అందుతాయని ఆశను లబ్ధిదారు వెలిబుచ్చుతున్నారు. వీలున్నంత త్వరలో స్థలాలు ఇస్తే మంజూరైన ఇళ్ళను నిర్మించుకుంటామని లబ్ధిదారులు అంటున్నారు.

ఇ-క్రాప్ నమోదుపై సవరణలు

విశాలాంధ్ర - లింగపాలెం : రబీలో ఇ-క్రాప్ నమోదు చేసిన జాబితాను రైతుభరోసా కేంద్రాలలో పబ్లిష్ చేస్తున్నట్టు మండల వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని ప్రతీ రైతుభరోసా కేంద్రంలో వీటి జాబితాను ఉంచామని ఈయన అన్నారు. వీటిలో సవరణలు ఉంటే సరిచేసుకోవాలని కోరారు. దీనికోసం ఈనెల 16 వరకు ప్రతీ రైతుభరోసా కేంద్రంలో గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు. మండలంలో రబీలో 7 వేల 200 ఎకరాలు ఇ-క్రాప్ నమోదు చేసినట్టు వ్యవసాయాధికారి వివరించారు.

విద్యార్థులను పరిశోధనలవైపు నడిపించాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : శాస్త్ర, విజ్ఞాన రంగాల్లో భారతదేశం మరింత పురోభివృద్ధి సాధించాలంటే కళాశాల స్థాయి నుంచే విద్యార్థులను నాణ్యమైన పరిశోధనల వైపు నడిపించాలని ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి. సందీప్ సూచించారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో పెదతాడేపల్లిలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 25 మంది ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు మంగళవారం ఏపీ నిట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ఆచార్యులు భోధనలకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో చోటుచేసు కుంటున్న పరిణామాలు, కృత్రిమ మెదస్సు, మిషన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్ వంటి అత్యాధునిక సాంకేతికతలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన మిషన్, పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ సిస్టం , సర్క్యూట్, ఎలక్ట్రికల్ మెజర్మెంట్ ప్రయోగశాలలతోపాటు కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్మెంట్ హబ్ ను వాసవి కళాశాల ఆచార్యులు పరిశీలించారు. ఆయా ప్రయోగశాలల పనితీరు, వాటి ప్రాముఖ్యతను నిట్ ఆచార్యులు (ప్రయోగశాలల ఇంచార్జ్ లు) డాక్టర్ టి రమేష్, డాక్టర్ పి.శంకర్ , డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ శ్రీ పణీకృష్ణ కర్రి వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఇంజినీరింగ్ కళాశాల డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ సీహెచ్.రాంబాబు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సుధారాణి, ఆచార్యులు డాక్టర్ చంద్రరావు, డాక్టర్ ఎన్.హరీష్, డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన వీఆర్వో సంఘ జిల్లా కార్యదర్శి ఎస్ వి సుబ్బారావు పేర్కొన్నారు. సుబ్బారావు మాట్లాడుతూ తన పై నమ్మకంతో తనను విఆర్ఓ సంఘ జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందున, వీఆర్వోల సమస్యలపై ప్రభుత్వంతో,ఉన్నత అధికారులతో చర్చించి వారి సమస్యలకు పరిష్కారం చూపుతానని అన్నారు. తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు జిల్లా వీఆర్వోలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వీఆర్వోల జిల్లా కార్యదర్శిని జంగారెడ్డిగూడెం డివిజన్ విఆర్వోల సంఘ అధ్యక్షుడు అడపా రాంబాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర- పాలకొల్లు: పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. భీమవరం దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు వర్థినిడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. పలువురు స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు స్వచ్ఛందంగా ఈహుండీ లెక్కింపులో పాల్గొన్నారు.ఈ లెక్కింపులో 105 రోజులకు, స్వామివారికి మొత్తం రూ.14,25,192లు ఆదాయంగా లభించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి అనతికాలంలో అధిక ఆదాయం వచ్చేలా కృషి చేస్తూ, ఆలయ అభివృద్ధికి పాటు పడుతున్న పెద్దగోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావును పట్టణంలోని పలువురు ప్రముఖులు, ప్రజలు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రెల్లి నరసింహారావు, పొత్తూరి పద్మ, నాగులుకొండ రుక్మిణి, పోలీసు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

విశాలాంధ్ర-భీమవరం: అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17వ తేదీల్లో విజయవాడలో చేపట్టే సత్యాగ్రహ, నిరసన దీక్షలు జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్యం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధితులందరికీ డిపాజిట్లను వడ్డీతో సహా చెల్లించాలన్నారు. మృతి చెందిన బాధితుల కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిదిన్నర సంవత్సరాలుగా అగ్రి బాధితులు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని పాలకులు పట్టించుకోకుండా గాలికొదిలేయడం దారుణమని విమర్శించారు. అగ్రి బాధితుల సమస్యను తీరుస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఓట్లేయించుకున్న జగన్ గద్దెనెక్కేక మడమ తిప్పాడని కోనాల దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి పాలకుల మెడలు వంచుతామని వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని ఆయన హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం శాఖ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, పట్టణ గౌరవాధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి,నాగిడి శాంతమూర్తి, షేక్ ఛాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారానికి శాశ్వత భూహక్కు పథకం

విశాలాంధ్ర-ఉండి: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు రక్ష పథకం ఏర్పాటు చేసిందని కోలమూరు గ్రామ రెవెన్యూ అధికారి టివి అప్పలాచార్యులు అన్నారు. మంగళవారం ఉండి మండలం కోలమూరు గ్రామంలో భూ రీ సర్వే కోసం డ్రోన్ ఫ్లై ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టివి అప్పలాచార్యులు మాట్లాడుతూ సరిహద్దు తగదాలకు స్వస్తి పలకడానికి ఈ భూ రీ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. భూ రీ సర్వే కోసం అత్యాధునికమైన డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే బృందం రీ సర్వే కి వచ్చినప్పుడు గ్రామంలోని రైతులు ప్రజలు తమ పాస్ పుస్తకాలను డాక్యుమెంట్లను తప్పనిసరిగా చూపించి సర్వే బృందానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ డ్రోన్ ఫ్లై ను గ్రామ ఉప సర్పంచ్ నడింపల్లి రాంబాబు రాజు, గ్రామ పెద్దలు రుద్రరాజు నరసరాజు, పద్మనాభ రాజు, చక్రవర్తి రాజు, మండల విస్తరణాధికారి అందే కొండలరావు, మండల సర్వేయర్ రత్నావళి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్ శంకర్, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ మహేంద్ర లక్ష్యం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : వ్యవసాయంలో యాంత్రీకీకరణ, రైతుల ఆర్థికాభివృద్ధి దిశగా మహేంద్ర అండ్ మహేంద్ర కంపెనీ పయనిస్తోందని మహేంద్ర గవర్నమెంట్ ,ఇనిస్టిట్యూషనల్ హెడ్ మనోజ్ దాల్వి అన్నారు. స్థానిక మహేంద్ర ట్రాక్టర్స్ డీలర్ సోమసాయి ఏజెన్సీస్ లో కొబ్బరి రైతులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సోమసాయి ఏజెన్సీస్ అధినేత సి హెచ్ ఏ ఆర్ కె వర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోజ్ దాల్వి మాట్లాడుతూ కోకో నట్ బోర్డ్ ,కేంద్ర ప్రభుత్వం సహకారంతో మహేంద్ర 275 మోడల్ ట్రాక్టర్ ను రైతులకు సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. మరో అతిథి కోకో నట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వెల్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 200 హెక్టర్లు కొబ్బరి తోటలకు ఎల్ ఓ డి స్కీం ద్వారా ఎరువులు, పురుగు మందులు, ఉచితంగా రామకృష్ణ సి. పి. సి. ద్వారా పంపిణీ చేస్తామన్నారు.నూతనంగా వేసే కొబ్బరి తోట లకు సబ్సిడీపై మొక్కలు, పురుగు మందులు, ఎరువులు అందజేస్తా మన్నారు. కొబ్బరి బోర్డ్, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా కొబ్బరి రైతులకు రూ.5 లక్షలు బీమా సౌకర్యం అందజేస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో కొబ్బరి రైతులు రుద్రరాజు సత్యనారాయణ రాజు, బండి సత్యనారాయణ, శివ రామ కృష్ణంరాజు, బాడవ సర్పంచ్, సత్యనారాయణ, మహేంద్ర స్టేట్ హెడ్ భీమా, టేరిటరి మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

విశాలాంధ్ర- ముసునూరు: ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేసినట్లేయితే అవసరాలు గల పిల్లలు ఆరోగ్యకరంగా వుంటారని ఫిజియోథెరఫిస్టు జి.ప్రశాంతి పేర్కొన్నారు.మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హెచ్.హేన్న మణి ఆధ్వర్యంలో ఫిజియోథెరపి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డి ఎం వి లక్ష్మినారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

విశాలాంధ్ర - పాలకొల్లు: పట్టణంలో గంజాయి సంస్కృతి రోజురోజుకు విస్తరిస్తోంది. యువత ప్రధానంగా గంజాయికి బానిసలై పోతున్నారు.మంగళవారం పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉల్లంపర్రు గ్రామంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులకు తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచినట్లు రూరల్ ఎస్సై శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. వీరు గంజాయి ఎవరి నుంచి కొనుగోలు చేశారు? అనే కోణంలో విచారణ చేస్తున్నామని, గంజాయి విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్ ఐ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

తెన్నేటి మాస్టారుకు ఉగాది జాతీయ పురస్కారం

విశాలాంధ్ర - గణపవరం: పశ్చిమ గోదావరి జిల్లా సాహితీ వేత్త అక్షర కిరీటి తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి (మాస్టారు) కు జాతీయ స్థాయి ఉగాది పురస్కారం 2023 లభించినట్లు లక్ష్మీ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. శ్రీ పద్మినీ పుర కళాపీఠం , గణపవరం వారు సమర్పించిన అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు వ్రాసిన 'తేనెలూరు తెలుగు మనది' అనే వ్యాస సంకలనానికి ఐ.ఎస్..ఓ గుర్తింపు పొందిన కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య వారు జాతీయ స్థాయిలో ఉగాది పురస్కారాన్ని ప్రకటించినట్లు ఈ సందర్భంగా తెన్నేటి మాస్టారుకు ఈ నెల 19 వ తేదీన (ఆదివారం)కర్ణాటక బెంగళూరు కళ్యాణ్ నగర్ లోని ఇండోఏషియన్ అకాడమీ లో నిర్వహించే ఉగాది ఉత్సవాలులో ముఖ్య అతిథి సి.బి.ఐ.మాజీ డైరెక్టర్ జె.డి.లక్ష్మీనారాయణ చేతుల మీదుగా తెన్నేటి మాస్టారు కు ఉగాది జాతీయ పురస్కారాన్ని (2023)ను ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు.

ఆవుదూడపై కుక్కల దాడి

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు గ్రామంలో మంగళవారం కుక్కలు ఆవుదూడ పై దాడి చేసి కరవడంతో ఆవు దూడ కొనఊపిరితో ఉంది. ఎస్సీ ఏరియాలో నివసిస్తున్న కాకిలేటి వీరాంజనేయులు కు చెందిన పది నెలల ఆవుదూడ పై కుక్కలు దాడి చేశాయి. ఆవుదూడ కి 10 నెలలు ఉంటాయి.వెటర్నరీ డాక్టర్, అసిస్టెంట్ గాయపడిన ఆవు దూడకు వైద్య సేవలు చేశారు.గ్రామంలో ఇదే మీ కొత్తది కాదని రెండు నెలల క్రితం కూడా గేదె దూడపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందిన సంఘటన జరిగింది. గ్రామంలో విపరీతంగా కుక్కలు ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ వారు కుక్కల బెడదలను తొలగించాలని కోరుతున్నారు.

నాటు..నాటు విజయోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ఉండి: ఆస్కార్ వేదికపై తన గానంతో కోట్లాది మంది ప్రజల హృదయాలలో స్థానం పొందటమే కాకుండా త్రిబుల్ ఆర్ నాటు నాటు సాంగుకు ఆస్కార్ అవార్డు సాధించిన బృందంలో ఒకరిగా ఉన్న రాహుల్ సిప్లిగంజ్ విజయోత్సవ వేడుకలు ఉండి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ అన్నమయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు.ఒక బార్బర్ గా ఉంటూ అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటిన రాహుల్ సిప్లిగంజ్ నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మలువలస అప్పారావు, రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి మలువలస వీర వెంకట సత్యనారాయణ, మలువలస రవి, హరికృష్ణ, తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిగా వెంకాయమ్మ

విశాలాంధ్ర - కుక్కునూరు : కుక్కునూరు కేంద్రంగా నూతన ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మంజూరైంది.ప్రాజెక్టు అధికారిణిగా కె. వెంకాయమ్మ బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు బుట్టాయగూడెం ప్రాజెక్టు పరిధిలో ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను వేరు చేసి కుక్కునూరు ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. కుక్కునూరు లో 90, వేలేరుపాడు లో 70 అంగన్ వాడి కేంద్రాలు, ఆరుగురు పర్యవేక్షకులు ఉన్నారు.

72 మందికి దోమతెరల పంపిణీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని యర్రమిల్లిపాడు గ్రామములో అమెన్ ట్రస్ట్, దూబచర్ల వారి సౌజన్యంతో గ్రామంలోని ఎస్.సి.ఏరియా లో 72 మందికి దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. వైద్యాధికారి డా.కే.ఎస్.వర్మ, తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణ రావు పర్యవేక్షణలో ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కే. ఎవాంజిలీన్ పంపిణీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ ఆమెన్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. డా.కే.ఎస్.వర్మ మాట్లాడుతూ ప్రజలందరూ వీటిని సద్వినియోగ పరచుకోవాలని ఆరోగ్య సూత్రాలు,సలహాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని మెరుగుపరచు కావాలని అన్నారు.సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ దోమతెరలవాడకం ద్వారా దోమలద్వారా వచ్చే వ్యాధులను అరికట్టుట కు దోహదపడుతుందన్నారు. ఆమెన్ ట్రస్ట్ మేనేజర్ కే.అశోక్ మాట్లాడుతూ 28,800విలువ చేసే దోమతెరలు సరఫరా చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో సామాజిక ఆరోగ్య అధికారి కే.పద్మ, వి.వి.నాగలక్ష్మి, ఆరోగ్యకార్యదర్శి సంధ్య, ఎం.ఎల్.హేచ్.పి. సోనీ,ఆరోగ్య సహాయకులు వెంకటస్వామి, శ్రీని వాసరావు,ఆశా పాల్గొన్నారు.

గ్రామ సర్వేలకు కిట్‌ల పంపిణీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగు టూరు మండలంలో గ్రామ సర్వేయర్ లకు గవర్నమెంట్ కిట్ లను మంగళ వారం తహసీల్దార్ ఏవీ రమణారావు పంపిణీ చేశారు. కిట్‌లో ఒక బనియన్, టోపీ, షూ,వాటర్ బాటిల్, కొలతలు కొలిచే టేపు, క్యాలిక్యులేటర్ లు అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిటి శేఖర్ బాబు, డిటి పోతురాజు, ఆర్ ఐ సత్యనారాయణ, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర - ఏలూరు : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం కింద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు రూరల్ శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. డి. ఆశ, డిఇఓ ఎస్.వి. రవిసాగర్, ఆర్ బిఎస్ కె జిల్లా కో-ఆర్డినేటర్ డా. సిహెచ్ మానస తదితరులు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ మానస , వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు అందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకున్న తర్వాత, విద్యార్థిని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆర్ బిఎస్ కె జిల్లా కో-ఆర్డినేటర్ డా. సిహెచ్ మానస మాట్లాడుతూ జిల్లాను 2025 నాటికి రక్తహీనత(ఎనీమియా) రహిత జిల్లాగా ఉంచేదిశగా నివారణచర్యలు చేపట్టాలన్నారు. ఎనీమియాను నివారించేందుకు నులిపురుగుల నివారణ ఎంతో ముఖ్యమని అందుకు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థినీ విద్యార్థులు, అందరు వేసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. ఆశ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచి పిల్లలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వి. రవి సాగర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి అన్నిపాఠశాలల్ల చదువుతున్న ,విద్యార్థిని విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఏలూరు రూరల్ ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి, ఏలూరు ఎంపీడీవో డాక్టర్ బి ప్రణవి వైద్యశాఖా అధికారిని డాక్టర్ మంజూష, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎ. సర్వేశ్వరరావు పలువురు ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం లో భాగంగా మండలంలోని గొల్లపల్లి పి హెచ్ సి నందు వైద్యులు డాక్టర్ పి శ్రీనివాస్ గౌతమ్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థుల ఆరోగ్యాన్ని పెంపొందింపచేస్తా యన్నారు. వైద్యురాలు డాక్టర్ పి. అనూష మాట్లాడుతూ మంగళవారం మాత్రలు అందని విద్యార్థులకు ఈనెల 18వ తేదీన అందజేస్తామన్నారు. పీ హెచ్ సి పరిధిలో 5752 మంది విద్యార్థులకు గాను 5470 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్ గుంట్రూ శ్రీనివాసరావు, పద్మావతి ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్ది ఆంజ నేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మంగళవారం సందర్భంగా మండలం లోని గురవాయిగూడెం గ్రామంలో ఉన్న శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ కీసరి విజయభాస్కర రెడ్డి కుమారుడికి ఇటీవల వివాహం జరగడంతో నూతన దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు . ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కుబడులు తీర్చుకుని, స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులు (నాగవల్లీ దళములు)తో అష్టోత్తరం పూజలను, అన్నప్రాసనలు, వాహన పూజలను నిర్వహించుకొన్నారు. దేవస్థానమునకు వివిధ సేవల రూపంలో రూ. 1లక్ష 7వేల474లు సమకూరినట్లు ఈఓ కొండలరావు తెలిపారు. సుమారు 1000 మంది భక్తులకు స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా ఆలయ ధర్మకర్తలు మళ్ళీడి మోహనకృష్ణ, దండు వెంకట కృష్ణంరాజు, బల్లే నాగలక్ష్మి, పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు తగిన ఏర్పాట్లు చేశారు.

వ్యాయామంతో ఆరోగ్యం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: సరైన వ్యాయామం లేని కారణంగా చిన్న వయసులోనే అనారోగ్యాల బారిన పడుతున్నారని, ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేసి ఒత్తిడిని తగ్గించుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి భవానీ ప్రసాద్ అన్నారు. స్థానిక పిరమిడ్ వద్ద క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ పార్క్ ను సందర్శించిన కమిషనర్ దృష్టికి అక్కడికి వచ్చిన ప్రజలు సీనియర్ సిటిజన్స్ పలు సమస్యలను తీసుకువచ్చారు. పార్క్‌లో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో సాయంత్రం చీకటి పడితే పార్క్ కి వచ్చిన పిల్లలు, వృద్ధులు విద్యుత్ లేక ఇబ్బంది పడుతున్నారని తెలియ చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ సమస్యపై సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే ఎలిజా, మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానని తెలియచేశారు. ఆయనతో పాటు పి. డి. నరసింహ రాజు, వాకర్స్ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయం వద్ద మంగళ వారం జన సేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పత్స మట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో ఉప్పాకపాడు ఎంపీటీసీ ఇంటి మంగరాజు జెండాను ఆవిష్కరించారు. తొలి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు,వీర మహిళలు,జన సైనికులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ సభకు తరలి వెళ్లిన జనసైనికులు

విశాలాంధ్ర-ఉంగుటూరు: మచిలీపట్నంలో జరిగే జనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభకు ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయం నుంచి 60 చిన్నకారులు, 20 బస్సులు ర్యాలీతో మచిలీపట్నం తరలి వెళ్లారు. నియోజవర్గంలో ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల నుండి జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. వెయ్యి మంది పైగా భోజనాలు ఏర్పాటు చేశారు.

ఆరోగ్యవంతమైన పిల్లలు నులి పురుగుల బారిన పడొద్దు

విశాలాంధ్ర - గణపవరం: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నిషేదిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ నులి పురుగుల నిర్ములన కార్య క్రమం చేపట్టిందని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి మంగళవారం అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పి సంతోష్ నాయుడు, డాక్టర్ కిరణ్మయిలు పాల్గొని మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్ర తీసుకొనుట వలన పోషకాహార లోపము, రక్తహీనత వల్ల నీరసం ఉండదని,శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, డాక్టర్ టి అక్కిరాజు, డాక్టర్ కె స్వరూప రాణి, డాక్టర్ సిహెచ్ అనురాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి రమేష్ కుమార్, డివివి చిన సత్యనారాయణ, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జనసేనతోనే సాధ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: సామాజిక న్యాయం జనసేనపార్టీ తోనే సాధ్యం అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు తెలిపారు. ఏపిగుంట పంచాయతీ శ్రీరామ వరంలో కార్యకర్తలు బయలు దేరిన బస్సును మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో జరిగే 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మండలం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్ళారని ఆయన తెలిపారు. మచిలీపట్నం సభకు హైటెక్ బస్ లు ఏర్పాటు చేసిన ఎన్ ఆర్ ఐ జనసేన అభిమానులు సత్య వెజ్జు, వంశీ పసుపులేటి, సింగంసెట్టి నాగ సుబ్రహ్మణ్యం లకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవ రాజు సురేష్, తోట సాయి, పాపోలు సుబ్రహ్మణ్యం,పాలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులు నివారణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర -ఉండి : బాల బాలికలలో నులిపురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. ఉండి మండలం ఎస్ఆర్ పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాను నాయక్ మాట్లాడుతూ బాలబాలికలలో నులిపురుగుల వలన రక్తహీనత నీరసం వంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఏర్పడతాయని వాటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పంజా ధర్మ తేజ మాట్లాడుతూ తమ పరిధిలో 96 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆర్ కృష్ణ కుమార్, ఏఎన్ఎం లక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి ప్రియాంక పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం త్రాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సమీపించడంతో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ఉండటంకోసం ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనే హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు త్రాగునీరు అందించడంలో అధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని దానికి సంబంధించిన కార్యాచరణ రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. శునకాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలు గుర్తించి అక్కడ నీటితో టబ్ లను ఏర్పాటు చేయాలని డిపివోకు ఆదేశాలిచ్చారు. జిల్లాలో 269 మంచినీటి చెరువులు ఉన్నాయని వీటిలో గోదావరి, కృష్ణ కాలువలు ద్వారా 228 ట్యాంకులకు 90 నుంచి 70 శాతం వరకు నీటిని నింపడం జరుగుతుందని 25 ట్యాంకుల్లో 75 నుంచి 50 శాతం, మరో 10 చెరువుల్లో 50 నుంచి 25 శాతం, ఒక చెరువులో 25 శాతం నీరు నింపడం జరుగుతుందని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఇఓ కె. రవికుమార్, ఇరిగేషన్ ఎస్.ఇ శ్రీనివాసరావు, డిపిఓ మల్లిఖార్జున రావు, ఏలూరు మున్సిపల్ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, జేడి వ్యవసాయశాఖ రామకృష్ణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు , డ్రామా పిడి. రాంబాబు ఆర్ డబ్ల్యూఎస్ ఏఇలు, డిఇలు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ కార్యక్రమం

విశాలాంధ్ర-పెంటపాడు : స్థానిక డి ఆర్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జా తీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాం బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాథమిక కేంద్రం వైద్యురాలు డా.మౌనిక హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్యాంబాబు మాట్లాడుతూ ఈనాటి వాతావరణ పరిస్థితులు భౌతిక పరిస్థితులు శారీరక పరిస్థితులు అర్థం చేసుకొని విద్యార్థిని విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మౌనిక విద్యార్థులకు ఆరోగ్యము పోషణ విషయాల్లో కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్, ఎంపవర్మెంట్ సెల్ ఎన్సిసి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మహమ్మద్ అజహర్ అహ్మద్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర -భీమవరం: ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న మహమ్మద్ అజహర్ అహ్మద్ కు చెన్నైలోని అన్నా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అహ్మద్ ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన డాక్టర్ మహమ్మద్ అజహర్ అహ్మద్ మాట్లాడుతూ అన్నా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కంద స్వామి రాజా పర్యవేక్షణలో అప్లికేషన్స్ ఆఫ్ ఇంటిలిజెంట్ కంట్రోలర్ స్కీమ్స్ ఫర్ పవర్ జనరేషన్ అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను తనకు పి.హెచ్.డి అవార్డు అయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అహ్మద్ను ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బి.ఆర్.కె.వర్మ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రానున్న ఎన్నికలలో జనసేన విజయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : జనసేన పార్టీ10 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండలంలో సరిపల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ (రవి) కేక్ కటింగ్ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పార్టీ స్థాపించడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీ ఆంధ్ర రాష్ట్రంలో విజయకేతనం ఎగరవేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పన ప్రసాద్, వమిశెట్టి మధు, సరిపల్లి, వేదాంతపురం, రామనుజపురం గ్రామాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - అంబాజీపేట : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ గౌతమి, ఇంద్రావతిల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నులు పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగు నిర్మూలనా కార్యక్రమం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో జాతీయ నులిపురుగు నిర్మూలనా కార్యక్రమం ఆత్రేయపురంలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ, అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్ 1, పేరవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల అభివృద్ధి అధికారి నాతి బుజ్జి మాట్లాడుతూ మండలంలో ఆత్రేయపురం, ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో అన్ని పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులందరికీ నులిపురుగు నివారణ మాత్రలు వేశారన్నారు. ఈ మాత్రలవల్ల విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొంది, తద్వారా వారిలో విద్యాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పివి ప్రసాదరావు, పేరవరం సర్పంచ్ గంటి విజయ భారతీ నాగేశ్వరరావు, సచివాలయ సెక్రటరీ శివ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమా గణేష్, హెల్త్ కో ఆర్డినేటర్లు ఏఎన్ ఎమ్లు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర-నిడదవోలు: ప్రతి చిన్నారి నులిపురుగుల నివారణకోసం ఆల్బెండజోల్ మాత్రను తప్ప కుండ వేసుకునేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాడిమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కంసాలిపాలెం సచివాలయం విలేజ్ హెల్త్ సెక్రటరీ కనికెల్లిశేషు కుమారి అన్నారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం లోని పాఠశాలలు,అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు నులిపురుగుల నిర్మూలన కు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చి మాత్రను చప్పరించి , నమిలి మ్రింగేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా శేషుకుమారి మాట్లాడుతూ పిల్లల్లో నులి పురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్త హీనత ఏర్పడి నీరసం, కాళ్ళు చేతులు లాగడం తో పాటు పలు అనారోగ్య బారిన పడ తారన్నారు. నులిపురుగుల వల్ల పిల్లలు శారీరక మానసిక లోపాలు కలిగి ఉంటారని శేషుకుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. శ్రీనివాసు,క్రాంతి, గంగారత్నం, ఎమ్ఎల్ హెచ్ పి.అమృత, ఆశాలు వెంకటలక్ష్మి, సుజాత, జీ యస్ యం కె. మణికంఠ, అంగన్‌వాడీ వర్కర్లు వెంకాయమ్మ, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర - చాగల్లు : మండల కేంద్రం చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం మంగళ వారం విజయవంతంగా జరిగింది. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరముల లోపు పిల్లలు కిషోర బాలలకు ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, మరియుప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో వేయబడ్డాయి మంగళవారం డి వార్మింగ్ వేయబడని కిషోర్ బాలలకు ఈనెల 18వ తేదీ శనివారం మాప్ అప్ చేయడం జరుగుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తనూజ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాగల్లు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. వీర్రాజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మరియు కళాశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, మహర్షి స్కూల్ కరస్పాండెంట్ బడేటి రమేష్, హెల్త్ అసిస్టెంట్ కె. నాగేశ్వరరావు, వైద్య ఆరోగ్య పారామెడికల్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

అభివృద్ధి కానరాని జగన్ పాలన

విశాలాంధ్ర - నిడదవోలు: వైసీపీ ప్రభుత్వం లో అన్ని రంగాలు కుంటు పడ్డాయని, జగన్ పాలనలో నిడదవోలు లో అభివృద్ధి కానరావడం లేదని నిడదవోలు టీడీపీ పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు.నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషా రావు ఆధ్వర్యంలో నిడదవోలు19వ వార్డులో ఇదేంఖర్మమనరాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలొ టీడీపీ పట్టణ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ,యూనిట్ ఇన్‌చార్జి ఎండి ఇస్మాయిల్ ఖాన్,షేక్ కరీం,అస్మత్ వినోద్,దొడ్డి రామారావు, సుబ్బరాజు, ఏకరాము, ఏక లక్ష్మి, యస్కెమస్తాన్, వరప్రసాద్, నంగాలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంకు జనసైనికులు

విశాలాంధ్ర - దేవరపల్లి: మచిలీపట్నంలో జరుగుతున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు గోపాలపురం నియోజకవర్గం నుండి డి.సువర్ణ రాజు ఆధ్వర్యంలో జనసైనికులు బయలుదేరారు. దేవరపల్లి లో పార్టీ జెండా ఆవిష్కరించి జండా ఊపిసువర్ణ రాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోపాలపురం, దేవరపల్లి మండలాలకు చెందిన జనసైనికులు, వీర మహిళలు బయలుదేరారు. నల్లజర్లలో నల్లజర్ల ద్వారకాతిరుమల మండలాలకు చెందిన జనసేన నేతలతో కలిసి మచిలీపట్నం బయలుదేరారు. ప్రతి జన సైనికుడు పార్టీ జెండా చేపట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు డి సువర్ణ రాజుతోపాటు పార్టీ ముఖ్యులు కంబాల సత్తిబాబు, చప్పటి శివ నాగ ప్రసాద్, సూరిశెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాస్, పోలుమాటి నాని, కవల సీతారత్న సూర్యకుమారి, డి.ఆనందప్రసాద్, సిద్ధా తాతబ్బాయి, గేలం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల ఆరాధ్యదైవం కార్ల్‌మార్క్స్

విశాలాంధ్ర -రాజానగరం : కార్మిక,కర్షక కష్టజీవులకు ఆరాధ్యదైవంగా కార్ల్ మార్క్స్ ఉంటారని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) అధ్యక్షులు జన్నుపల్లి సత్తిబాబు,సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి. వెంకట్ నాయుడు అన్నారు.ఆర్థికవేత్త, సామాజికవేత్త, సోషలిస్టు విప్లవకారుడైన కార్ల్ మార్క్స్ 140వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ,అఖిల భారత రైతు కూలీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని సూర్యారావుపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక,కర్షిక కష్టజీవులకు ప్రపంచంలో ఒక సిద్ధాంతాన్ని అందించి శ్రమ జీవుల రాజ్యాల స్థాపనకు దిక్సూచిగా పని చేశారన్నారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ నాయకులు మరికుర్తి వీరలక్ష్మి, తామరల గౌరీ, నక్క లక్ష్మి , వర్ష, దుర్గ, తోటకూర బేబీ, ఎలా అరుణ, సరస్వతి, జగదంబ తదితరులు పాల్గొన్నారు.

7,912 మందికి నులిపురుగుల మందు పంపిణీ

విశాలాంధ్ర - కరప : కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగుల మందును మంగళవారం 7,912 మందికి పంపిణీ చేసినట్టు డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కరప పిహెచ్‌సి పరిధిలో 12 సచివాలయాలు, 42 అంగన్‌వాడీ కేంద్రాలు 5 జూనియర్ కాలేజీలు 46 ప్రైమరీ స్కూల్ నందు 7,912 మందికి అందించామన్నారు. దీనికి సంబంధించిన సిబ్బంది ఆయాకేంద్రాలకు వెళ్ళి ముందు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈమందును మొదటి సంవత్సరం నిండిన పిల్లలు నుండి 19 సంవత్సరాలు వయసు వున్న అందరికీ వేశామని పేర్కొన్నారు.

శ్రీనివాస కళాశాలలో

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవమును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చేపట్టింది. ఒక సంవత్సరం నుండి 19 ఏళ్ళ వయసు వారికి ఆల్బెండజోల్ మాత్రల్ని 353 కళాశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. భోజనం అనంతరం మాత్రలు తీసుకొనుట ద్వారా నులిపురుగు నివారణతో బాటు భావి భారత పౌరుల్ని ఆరోగ్య వంతులుగా ఉంచేందుకు ప్రభుత్వము తీసుకొన్నటువంటి చర్యలు ఉపకరిస్తాయని, ప్రతి విద్యార్థి విధిగా మాత్రలను స్వీకరించాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రత్నరాజు, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్ రాజు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఏడాది వయసు మొదలుకొని 19 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఆల్బెండెజల్ టాబ్లెట్ వేసుకోవాలని, డాక్టర్ జె. శ్రీనివాస్ సూచించారు. డాక్టర్ వి వి దుర్గాభవాని పర్యవేక్షణలో.మంగళవారం హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రైవేట్ కాలేజీలు అంగన్వాడీ కేంద్రాలు మండల ప్రాథమిక పాఠశాలలు, హై స్కూల్ లోన విద్యార్థులకు సుమారు 5606 ఆల్బెండాజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే వీరభద్రుడు, హెచ్ వి ఆర్ నీలవేణి, ప్రసాదు, త్రిమూర్తులు, రూతమ్మ, మంజుల, కన్నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1నుండి 19 సంవత్సరాల పిల్లలకు,కిషోర బాలికలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేసినట్టు ఆయన తెలిపారు. టాబ్లెట్స్ డీవార్మింగ్ చేయబడని పిల్లలకు ఈ నెల 18వ తేదీన జరిగే మాప్-అప్ రోజున ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎన్ టి స్వామి, సిహెచ్ ఓ పి ప్రసాదరావు,ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర-భీమడోలు: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రోజు జనసేన పార్టీ భీమడోలు కార్యకర్తల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు, తరువాత మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన మరి జీవి పొట్టి శ్రీరాములు పుణ్య వేదిక వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మరాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో ప్రతి మదన్,నిమ్మకాయల ఘన,దౌలూరు సునీల్,వేమన దుర్గాదేవి, దౌలూరి సునీల్, లోకరాజు, మోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - ముసునూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతి విద్యార్థికి నులిపురుగు మాత్రలు వేస్తున్నట్లు రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని16 గ్రామాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో చదువుతున్న విద్యార్థిని ,విద్యార్థులకు నూటికి 96.7శాతం మందికి నులిపురుగుల మాత్రలు వేసినట్లు తెలిపారు.మిగతా వారికి బుధవారం వేస్తామని తెలియచేశారు.

నేటి నుండి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 15వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయని శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రఘు మంగళవారం తెలిపారు.పరీక్షలు ఉదయం 9-00 గంటల నుండి మధ్యాహ్నం 12-00 గంటల వరకు జరుగుతాయని విద్యార్థిని విద్యార్థులు ఉదయం 8 -30 నిమిషాలకు కాలేజీ పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన అన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు త్వరగా రావాలని ఆయన కోరారు. 9-00గంటలు విద్యార్థులు పరీక్షకు హాజరైతే ఆ విద్యార్థి లోనికి ప్రవేశం లేదని ప్రభుత్వం కచ్చితంగా నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం రెగ్యులర్ 275 మంది ,ప్రైవేట్ 29 మంది మొత్తం 304 మంది హాజరవుతారని, అలాగే ద్వితీయ సంవత్సరం 245 మంది రెగ్యులర్ 51 మంది ప్రవేటు మొత్తం 296 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

95% మందికి నులి పురుగుల మందు పంపిణీ

విశాలాంధ్ర - గండేపల్లి : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు అల్బెండజోల్ మాత్రలు వేశారు.గండేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గండేపల్లి మండలంలో 1 సం. నుండి 19 సంవత్సరం లోపు పిల్లలు 6575 మంది ఉన్నట్లు గుర్తించామని తెలియజేసారు. మంగళవారం 95% పిల్లలకు మాత్రలు మింగించామన్నారు. మంగళవారం మాత్రలు వేసుకోనివారికి 18వ తేదిన ఇస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా గండేపల్లి గవర్నమెంట్ స్కూల్ , అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. విద్యార్థులు అందరు తప్పని సరిగా మాత్రలు వేసుకోవాలని కోరారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేసారు. వయసును బట్టి 1 సం. నుండి 2 సంవత్సరముల వరకు అర మాత్ర అల్బెండజోల్-200 మి.గ్రా, 2 సం. 19సం. వరకు ఒక మాత్ర అల్బెండజోల్-400 మి.గ్రా మింగించడం జరుగుతుందని తెలియజేశారు. కడుపులో నులిపురుగులుంటే పోషకాహార లోపం, రక్త హీనత, శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు కలిగి ఉంటారని తెలియ జేసారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.